### మున్సిపాలిటీగా మారినా..

# పంచాయతీ పేరుతోనే పత్రాలు

- రెండునెలలు గడిచినా వెబ్‌సైట్‌లో నమోదు కాని పేరు
- ఇబ్బందులు పడుతున్న 'మీసేవ' దరఖాస్తుదారులు
- 'వికాసం' దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వం



ఏదులాపురం మున్సిపాలిటీ కార్యాలయం

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 4 : ఖమ్మంరూరల్ మండలంలోని మొత్తం పన్నెండు గ్రామాల సమూహంతో ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. అందుకు అనుగుణంగా అన్ని విభాగాలు, శాఖల్లో మార్పులు చేయలేదు. దీంతో మీసేవ కేంద్రాల్లో పంచాయతీల పేరుతోనే ధ్రువపత్రాలు జారీ అవుతున్నాయి. జనవరిలో తెలంగాణ ప్రభుత్వం పాలేరు నియోజకవర్గంలో తొలి మున్సిపాలిటీగా ఏదులాపురాన్ని ప్రకటించింది. దీంతో 32 పంచాయతీలకు గాను కేవలం 20 పంచాయతీలతోనే ఖమ్మం రూరల్ మండలాన్ని కుదించింది. 12 పంచాయతీలతో ఏదులాపురం మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. అయితే, మున్సిపాలిటీ ఏర్పాటై నేటికి 70 రోజులు పూర్తయింది. అయితే ఇప్పటి వరకూ మీసేవ వెబ్‌సైట్ 'ఏదులాపురం మున్సిపాలిటీ' అనే ఆప్షన్ కనపడడం లేదు. ఇదే సమయంలో రాజీవ్ యువ వికాసం పథకానికి విరివిగా దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రభుత్వం ప్రకటనలు గుప్పించింది. దీంతో ఆ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు నిరుపేదలు పోటెత్తుతున్నారు. అయితే అందుకు కావాల్సిన పత్రాలను పొందేందుకు మీసేవ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. అయితే, ఏదులాపురం మున్సిపాలిటీ ప్రజలకు మాత్రం నిరాశే మిగులుతోంది. 'ఏదులాపురం' పేరిట 'మీసేవ' వెబ్‌సైట్‌లో మున్సిపాలిటీ పేరు కన్పించడం లేదు. దీంతో కొత్తగా వస్తున్న కుల, ఆదాయ ధ్రువపత్రాలన్నీ పాత పంచాయతీల పేరుతోనే జారీ అవుతున్నాయి. అయితే, ఆదాయ ధ్రువపత్రం విషయంలో నిరుపేదల మరింత ఇబ్బంది పడుతున్నారు. పట్టణ పేదలకు ఒక టారిఫ్‌ను, గ్రామీణ పేదలకు మరో టారిఫ్‌ను ప్రభుత్వం రూపొందించింది. దీంతో పంచాయతీల పేరుతో జారీ అవుతున్న ఆదాయ ధ్రువపత్రాలు.. త్వరలో పట్టణ ప్రాంతాల్లో చెల్లుబాటు కావంటూ ప్రభుత్వం తిరస్కరిస్తే తమ పరిస్థితి ఏమిటంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రక్రియ కొనసాగుతోంది..**

ఏదులాపురం మున్సిపాలిటీ పేరు కొద్ది రోజుల్లోనే వెబ్‌సైట్‌లో డిస్‌ప్లే అవుతుంది. అందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. ధ్రువపత్రాలు పంచాయతీల పేరుతో ఉన్నప్పటికీ ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కావు.

– మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్

# సవరణల బిల్లుతో పెన్షనర్లకు ప్రమాదం

### రావెళ్ళ సీతారామయ్య


సమావేశంలో మాట్లాడుతున్న రావెళ్ళ సీతారామయ్య

ఖమ్మం, ఏప్రిల్ 4: కేంద్ర ప్రభుత్వం త్వరలో తీసుకురాబోతున్న పెన్షన్ సవరణల బిల్లుతో పెన్షనర్లకు తీవ్ర ప్రమాదమని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు రావెళ్ళ సీతారామయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎం.శరత్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షన్ సవరణల బిల్లును వెంటనే ఉపసంహరించాలని, లేకుంటే కేంద్ర, రాష్ట్రవ్యాప్తంగా పెన్షనర్లు ఉద్యమబాట చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేదరమెట్ల సుబ్బయ్య మాట్లాడుతూ పెన్షనర్లకు అన్ని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదురహిత వైద్యం అందించాలని కోరారు. సమావేశంలో సుదర్శన్‌రెడ్డి, డీకేశర్మ, తాళ్లూరు వేణు, ఉపేందర్‌రావు, పూస సాంబశివరావు, రఘుపతిరెడ్డి, పూర్ణచందర్‌రావు, రాజారావు, కృష్ణమూర్తి, బాబూరావు, అన్నిశాఖల బాధ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి : కలెక్టర్


రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

వైరాటౌన్, ఏప్రిల్ 4: విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. వైరా నియోజకవర్గ కేంద్రంలోని టీఎస్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్మాణం చేపట్టే ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణంతో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల గురించి ప్రిన్సిపాల్ రమాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అధికారులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

## సన్నబియ్యం రవాణా వేగవంతం చేయాలి

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఖమ్మం, ఏప్రిల్ 4 : రేషన్‌షాపులకు సన్నబియ్యం రవాణాను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి సన్నబియ్యం రవాణాపై కలెక్టర్లు ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ రేషన్‌షాపుల వద్ద అవసరమైన సన్నబియ్యం అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి.శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగరాభివృద్ధే లక్ష్యం : మేయర్ నీరజ

ఖమ్మం, ఏప్రిల్ 4 : ఖమ్మం నగర సమగ్రాభివృద్ధే తమ లక్ష్యమని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ఖమ్మం నగరంలో మంత్రి తుమ్మల సిఫారసు మేరకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం లబ్ధిదారుల ఇంటి దగ్గరికి వెళ్లి పంపిణీ చేశారు. ట్రంక్‌రోడ్‌లోని వాసవి అమ్మవారి టెంపుల్ ఎదుట చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 30, 31, 32, 33, 35, 48వ డివిజన్లలో చెక్కులు పంపిణీ చేశారు.

## భువనేశ్వరిలో 'గ్రాడ్యుయేషన్ డే'


భువనేశ్వరిలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

రఘునాథపాలెం, ఏప్రిల్ 4 : ఖమ్మం నగరం పాండురంగాపురానికి చెందిన భువనేశ్వరి విద్యాలయంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. దీనికి 2, 4వ డివిజన్ల కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, మలీదు వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తమ తమ తరగతులను పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్పొరేటర్లు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలోనే ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. విశాలమైన ప్రాంగణంలో విద్యాబోధన అందిస్తున్న భువనేశ్వరి పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ లలిత, కరస్పాండెంట్ జే రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## స్మార్ట్‌కిడ్జ్‌లో...


గ్రాడ్యుయేషన్ డే లో స్మార్ట్‌కిడ్జ్ విద్యార్థులు

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 4 : స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్సరీ నుంచి ఐదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. విద్యార్థులను ఆల్‌రౌండర్లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ సుకన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టైనిటాట్స్‌లో ఇంగ్లిష్ కార్నివాల్



విద్యార్థులతో కరస్పాండెంట్ శెట్టి భాస్కర్

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 4 : ఖమ్మం నగరంలోని టైనిటాట్స్ హైస్కూల్‌లో శుక్రవారం ఇంగ్లిష్ కార్నివాల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శెట్టి భాస్కర్, ఉపాధ్యాయులు సబిత, సత్యనారాయణ, సౌమ్యశ్రీ, ఝాన్సీ, నజీర, నాగమణి, సంధ్య, జ్యోతిశ్రీ, అలేఖ్య, నజీయ, మౌనిక పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# వారం రోజుల్లో కొత్త రేషన్ కార్డులు

### శ్రీరామనవమి తరువాత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
### అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి పొంగులేటి


కట్టుకాసారంలో రూ.3 కోట్లతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి/ కూసుమంచి (నేలకొండపల్లి), ఏప్రిల్ 4 : అర్హులైన పేదలకు వారం రోజుల్లో తెల్ల రేషన్ కార్డులు ఇస్తామని, శ్రీరామనవమి తరువాత నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. తొలుత నేలకొండపల్లి మండలం కట్టుకాసారంలో రూ.3 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. రైతుల ధాన్యం నుంచి తరుగు తీసే మిల్లర్లపై కేసులు పెట్టాలని అధికారులను ఆదేశించారు.యాసంగిలో కూడా క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామన్నారు. తరువాత కూసుమంచి సబ్ స్టేషన్‌లో నిర్మించ తలపెట్టిన ఈఆర్‌వో కార్యాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మత్స్యకారులకు ఉపకరణలు అందజేశారు. దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్లు పంపిణీ చేశారు. అధికారులు గంగాధర్, పుల్లయ్య, చందన్‌కుమార్, డీఎం శ్రీలత, నర్సిహరావు, తిరుపతిరెడ్డి, రమేశ్, చోహన్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు కోక్యానాయక్, సునీత పాల్గొన్నారు.

## బ్లూమింగ్‌మైండ్స్ ఆడిటోరియం ప్రారంభం

రఘునాథపాలెం, ఏప్రిల్ 4 : ఖమ్మం నగరం బల్లేపల్లిలో ఉన్న బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్‌లో నూతనంగా నిర్మించిన ఆడిటోరియంను రాష్ట్ర రెవెన్యూ, గృహ, సంక్షేమశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో కలిసి టేబుల్‌టెన్నిస్ ఆడారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ భీమిరెడ్డి గౌతంరెడ్డి, కరస్పాండెంట్ పీ అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వి కిరణ్‌కుమార్, కార్పొరేటర్ హుస్సేన్, నాగటి ఉపేందర్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల

## పలు కుటుంబాలకు జడ్పీ మాజీ చైర్మన్ పరామర్శ

మధిర (చింతకాని), ఏప్రిల్ 4 : జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు చింతకాని మండలం నేరడ గ్రామంలో శుక్రవారం పర్యటించి పలు కుటుంబాలను జిల్లా పరామర్శించారు. నేరేడ గ్రామానికి చెందిన వడ్డేపూడి చిన్ననర్సయ్య ఇటీవల మృతిచెందగా అతడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం షేక్ నాగుల్‌మీరా ఇటీవల మృతిచెందగా అతడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు పెంట్యాల పుల్లయ్య, గురిజాల హనుమంతరావు, మంతెన రమేష్, గడ్డం శ్రీను, వేముల నర్సయ్య, నన్నక కోటయ్య, చెవుల ప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'రేషన్' దరఖాస్తుల క్షేత్ర పరిశీలన

బోనకల్లు, ఏప్రిల్ 4: కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు కార్యాచరణలోకి దిగారు. మండలంలోని 22 గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు క్షేత్ర పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్ మాట్లాడుతూ.. తమ సిబ్బంది గ్రామాల వారీగా కుటుంబాలను కలిసి దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా 2,988 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వారి ఆధారాలను పరిశీలించి మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్‌ఐలు నవీన్, మైథిలి, నాగార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రేషన్‌కార్డుల దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

### ఓబీసీల దీక్షకు ఎంపీల సంఘీభావం

ఖమ్మం, ఏప్రిల్ 4 : దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీలకు అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుండడం తీవ్ర విచారకరమని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కేఆర్ సురేష్‌రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రాంగణంలో కొనసాగుతున్న ఓబీసీల దీక్షా శిబిరాన్ని ఎంపీలు శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. మహిళలతోపాటు బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందేనని వారు స్పష్టం చేశారు. భండారి గంగాధర్, కొంగర నరహరి, మోహన్‌రెడ్డి, కాపర్తి కుమార్‌గార్గే, నాయకులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిళ్లగూడెం, ఏప్రిల్ 4 : ఖమ్మం నగర పరిధిలోని దానవాయిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 5వ తేదీ శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ –1 ఏడీఈ నాగార్జున శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 11గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడే ప్రాంతాలు సారధినగర్, రామాలయం వీధి, సాయిబాబా దేవాలయం రోడ్డు, బీరప్ప టెంపుల్, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, జూబ్లిస్కూల్, జూబ్లిపురం, రెయిబోకాలనీ, దానవాయిగూడెం, రామన్నపేట, సబ్‌జైల్ ప్రాంతం, దానవాయిగూడెం, కామంచికల్, జాన్‌బాద్‌తండా, దారేడు ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

### నేత్రదానం

వేంసూరు, ఏప్రిల్ 4: మండలంలోని చౌడవరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ఆళ్ల గోపాలరావు (80) గురువారం రాత్రి మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులు గోపాలరావు నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి దానం చేశారు. ఆయన భౌతికకాయాన్ని పలువురు నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు.

### ఆటో బోల్తా పడి పలువురికి గాయాలు

వేంసూరు, ఏప్రిల్ 4: ట్రాలీ ఆటో అదుపు తప్పి పలువురికి గాయాలైన ఘటన ఆంథోనినగర్ వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని దిద్దుపూడి గ్రామానికి చెందిన కూలీలు చింతలపూడి మండలం వెలగలపల్లిలో మొక్కజొన్న ఫ్యాక్టరీలో పనికి వెళ్లారు. తిరిగి ఆటోలో వస్తుండగా ఆంథోనినగర్ వద్ద ఆటో టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న 10 మంది కూలీలకు గాయాలు కాగా వీరిలో కనపర్తి లక్ష్మికి తీవ్ర గాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు.

### బియ్యం వితరణ

వైరాటౌన్, ఏప్రిల్ 4: వైరా పట్టణ ఆర్యవైశ్య యువ నాయకులు కొణతాలపల్లి సుజిత్–మౌనిక పెళ్లిరోజు సందర్భంగా వాసవి క్లబ్ వైరా వారి ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్యులు మైలవరపు భద్రయ్యకు 25 కేజీల బియ్యం వితరణగా అందజేశారు. రాయల నాగేశ్వరరావు, రవికుమార్, మైలవరపు శ్రీనివాసరావు, ఉపేంద్రరావు పాల్గొన్నారు.

### చిన్నారులకు పోషకాహారం

కారేపల్లి, ఏప్రిల్ 4: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీ. గీతాభాయ్ అన్నారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు బాలామృతం, గుడ్లు క్రమం తప్పకుండా పంపిణీ చేయాలని, పోషక లోపం కలిగిన చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హాజరు, రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

### కేఎండీసీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 4 : కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు మొదటి సెమిస్టర్ ఫలితాల్లో సత్తాచాటారని కరస్పాండెంట్ కొటా అప్పిరెడ్డి శుక్రవారం తెలిపారు. బీఎస్సీలో మౌనిక 9.42 జీపీఏ, రమ్యశ్రీ 9.15, దివ్య 9.07 జీపీఏతో రాణించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

### విద్యుత్‌శాఖ చీఫ్ ఇంజినీర్ పర్యటన

మామిళ్లగూడెం, ఏప్రిల్ 4 : టీజీఎన్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్ రాజుచౌహన్ శుక్రవారం ఖమ్మం నగరంలో పర్యటించారు. వేసవికాలంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చేపడుతున్న పనులను పరిశీలించారు. ఖమ్మం టౌన్–5 పరిధిలో నిర్మాణంలో ఉన్న రెండు 160 కేఈవీ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఖమ్మంఖిల్లా ప్రాంతంలో కోటీ పదిలక్షల రూపాయల వ్యయంతో గవర్నమెంట్ ఆసుపత్రి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్న 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణం పనులు తనిఖీ చేశారు. పనులు వేగవంతంగా, నాణ్యతలో రాజీలేకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. ఎస్ఈ శ్రీనివాసాచారి, ఖమ్మం డీఈ రామారావు, టౌన్–1 ఏడీఈ నాగార్జున టౌన్–2 ఏడీఈ యాదగిరి, ఏఈలు పాల్గొన్నారు.

### ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

మామిళ్లగూడెం, ఏప్రిల్ 4 : ఖమ్మం రెండోపట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ బి.పాపా కుటుంబానికి రావాల్సిన భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును శుక్రవారం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అందించారు. పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పోలీస్‌శాఖ నుంచి మంజూరు చేసిన రూ.8 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు.

### ఉచిత ఎప్‌సెట్ కోచింగ్

ఖమ్మంఅర్బన్, ఏప్రిల్ 4 : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సైన్స్ చదివిన విద్యార్థులకు ఉచితంగా ఎప్‌సెట్ కోచింగ్ అందజేస్తున్నట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు. బాలురు 50 మంది, బాలికలు 50 మందిని ఎంపిక చేసి శుక్రవారం శిక్షణను ప్రారంభించినట్లు తెలిపారు. బాలురకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, బాలికలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శిక్షణను కల్పిస్తున్నారు.

### బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 4: సత్తుపల్లి ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి జేవీఆర్, కిష్టారం ఓపెన్‌కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. జేవీఆర్ ఓసీలో 10వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి 40 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలిగించే పనులను, అలాగే కిష్టారం ఓసీలో 3 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, 15 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు పనులకు అంతరాయం ఏర్పడినట్లు సింగరేణి ప్రాజెక్టు అధికారులు తెలిపారు. గనుల్లో భారీగా వరద చేరడంతో ఉపరితలం చిత్తడి చిత్తడిగా మారింది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.

### తల్లిదండ్రులు నచ్చేలా.. సమాజం మెచ్చేలా జీవితం ఉండాలి

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 4: స్థానిక విశ్వశాంతిలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు నచ్చేలా.. సమాజం మెచ్చేలా జీవించాలని విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు, మంచి సంస్కృతీ సంప్రదాయాలు అలవర్చుకోవాలన్నారు. పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు అనిల్ రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని హర్షియా అనే విద్యార్థినికి అందజేశారు. పాఠశాల యాజమాన్యం నరుకుళ్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 'సాయిస్ఫూర్తి'లో జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్టివల్

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 4: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్టివల్‌లు నిర్వహించాలని అసోసియేషన్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఇన్ సాయిస్ఫూర్తి ఏసీఎస్ఈఈ–2కే25 కన్వీనర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యాకుబ్ అన్నారు. శుక్రవారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్టివల్ ఏసీఎస్ఈఎస్ఎస్–2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి బహుమతులు అందజేశారు. రాజ్యసభ సభ్యుడు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, ప్యాట్రన్‌గా కళాశాల ప్రిన్సిపాల్ వూటుకూరి శేషారత్నకుమారి, కన్వీనర్‌గా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ షేక్ యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

### ముస్లింల నిరసన ప్రదర్శన

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 4: పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు ఆమోదించడం పట్ల ముస్లిం సంఘాలు శుక్రవారం జామె మసీదు నుంచి బస్టాండ్ రింగ్‌సెంటర్ వరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జామె మసీదు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కే.నాయబ్‌రసూల్, ఎం.డీ.కమల్‌పాషా మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాస్తూ వక్ఫ్ బిల్లును ఆమోదించడం దారుణమన్నారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. రఫీ, మౌళాలి, రియాజుద్దీన్, షాకిర్, అమీర్‌జాని, ఆదిల్‌పాషా, ఎస్‌కే రఫీ, ఎస్‌కే ఇమాం, గాదె చెన్నారావు, సామేలు, రాజబాబు పాల్గొన్నారు.

### ఫొటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

బోనకల్లు, ఏప్రిల్ 4 : మండల ఫొటో అండ్ వీడియోగ్రఫీ అసోసియేషన్ నూతన ఎన్నిక బోనకల్లులో శుక్రవారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా సీహెచ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సారిక చైతన్య, కోశాధికారిగా కొంగర తిరుపతిరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీని సంఘం జిల్లా నేతలు అధ్యక్షుడు వెంకట్, మోదుగు శ్రీనివాసర్, మండల ఫౌండర్ పళ్ల శ్రీనివాస్ అభినందించారు.

### 'ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి'

బోనకల్లు, ఏప్రిల్ 4 : రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ డిమాండ్ చేశారు. సంఘం నేత చిన్నరంగారావు అధ్యక్షతన బోనకల్లులో శుక్రవారం జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. సంఘం నాయకులు సద్దాబాబు, సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### నిజాయితీ చాటుకున్న కండక్టర్

వైరాటౌన్, ఏప్రిల్ 4: బస్సులో ఫోన్ మర్చిపోయిన వ్యక్తికి ఫోన్ అప్పగించి తన నిజాయితీ చాటుకున్నారు కండక్టర్ అనూష. మధిర డిపో నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు హైదరాబాద్ వెళ్తుంది. బస్సు వైరా బస్టాండ్‌కు రాగానే రాయల వెంకట్ అనే వ్యక్తి ఖమ్మం వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. ఖమ్మం నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు దగ్గర బస్సు దిగిపోతూ తన ఫోన్‌ను మరిచిపోయాడు. బస్సు హైదరాబాద్ నుంచి తిరిగి వైరా బస్టాండ్ చేరగానే బస్సు కండక్టర్, డ్రైవర్ ఫోన్‌ను రాయల వెంకట్‌కు వైరా బస్టాండ్ కంట్రోలర్ బివి చేతుల మీదుగా అందజేశారు. కండక్టర్ నిజాయితీని పలువురు ప్రయాణికులు అభినందించారు.

### 'మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి'

మధిర, ఏప్రిల్ 4 : రైతులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ ఖమ్మం డీఎం సునీత సూచించారు. చింతకాని సహకార సంఘంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. మొక్కజొన్న పండించిన రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను విక్రయించి క్వింటాకు రూ.2,225 మద్దతు ధర పొందాలని సూచించారు. మొక్కజొన్నల్లో తేమ శాతం 14 మించి ఉండకూదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కొండపల్లి శేఖర్‌రెడ్డి, కూరపాటి అనంతరాజు, మానస, కొప్పుల గోవిందరావు, కోటేశ్వరరావు, రవి, మనోహర్‌బాబు, కోటయ్య, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### గురుకులాలకు 'నరసింహాపురం' విద్యార్థుల ఎంపిక

ఎర్రుపాలెం, ఏప్రిల్ 4 : తమ పాఠశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు గురుకులాల ప్రవేశ పరీక్షలు ప్రతిభ చాటినట్లు మండలంలోని నరసింహాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.నాగేశ్వరరెడ్డి తెలిపారు. కాగా, ఐదో తరగతిలో ప్రవేశాలకు ఎంపికైనట్లు ఈ విద్యార్థులను ఎంఈవో మురళీమోహన్‌రావు, పాఠశాల సముదాయ చైర్మన్ సీహెచ్ రంగారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఎస్.బంగారమ్మ, గ్రామస్తులు అభినందించారు.

### రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 4: పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను తిరుమలాయపాలెం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ట్రాక్టర్లు సూర్యాపేట జిల్లా మోతే మండలానికి చెందినవిగా గుర్తించారు. ట్రాక్టర్లపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ల తనిఖీ..

ముదిగొండ, ఏప్రిల్ 4: మండలంలోని చిరుమర్రి వద్ద ఉన్న ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ సునీతా ఎలిజెబెత్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంధసిరి, పెద్దమండవల్లోని మున్నేరు నుంచి ఇసుక తరలించడానికి అధికారులు కొద్దిరోజులుగా కూపన్లు మంజూరు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇసుక రవాణా చేస్తున్న వారి వద్ద వే బిల్లులను తహసీల్దార్ పరిశీలించారు. అనుమతించిన సమయంలోనే ఇసుక రవాణా చేయాలని, ట్రాక్టర్లను వేగంగా నడపవద్దని సూచించారు.

### దొడ్డి కొమరయ్య విగ్రహావిష్కరణ

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 4: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని మండలంలోని కాకరవాయిలో గురువారం రాత్రి గ్రామ యాదవ సంఘం బాధ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు సంగంరెడ్డి పృథ్వీరాజ్ మాట్లాడారు. సంఘం నాయకులు గుండెబోయిన ఎర్రయ్య, పగడాల నాగరాజు, అల్లిక వెంకటేశ్వర్లు, ఎన్నబోయిన రమేశ్ పాల్గొన్నారు.